

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పాలిస్తున్నారని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో ఆదివారం గడప..గడపకూ.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నివాస స్థలాలు ఇచ్చారు స్థలాలు చూపిస్తే ఇల్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు ఎంఎల్ఎకు విన్నవించారు. హౌసింగ్ లోన్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎఎంసి వైస్ ఛైర్మన్ నాగవరపు నాగరాజు, వెన్నపు రాంబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎచిట్టిబాబు

తాగునీటికి కటకట

- ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు స్వగ్రామం నగరం శివారు ప్రాంతాల్లో పరిస్థితి
- చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు స్వగ్రామమైన నగరం పంచాయతీ పరిధిలో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత లేదా ప్రభుత్వం పై ఉంది. రక్షిత తాగునీరు ప్రజల అవసరాలలో ప్రధానమైనది. గుక్కెడు నీరు కోసం శివారు ప్రాంతాల వారు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో ఆర్‌డబ్ల్యూఎస్, జలజీవన్ మిషన్, గెయిల్, ఒఎన్‌జిసిల సహకారంతో తాగునీరు అందించేందుకు వివిధ పథకాలు ఉన్నప్పటికీ అవి పూర్తి కాక ఎప్పటిలాగే ఈ వేసవిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. సం బంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలు అవసరాలు పరిశీలించక పట్టించుకోకపోవడంతో తాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

నగరం గ్రామంలో సుమారు 6500 మంది జనాభా కలిగి సుమారు రెండు వేల వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో శివారు ఒఎన్‌జిసి ప్రాంతాలైన బిఎస్ మూర్తి రోడ్డు, తాడి వారి మెరక, జాలెంవారిమెరక, సిద్ధార్థనగర్, ఏరియాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. బిఎస్.మూర్తి రోడ్డులో బిందె నిండాలంటే ట్యాప్‌ల వద్ద గొయ్యితవ్వాల్సిందే. అది కూడా చాలీచాలని నీరు వస్తుండడంతో ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు.

తాడిమెరక విషయం వచ్చేసరికి గెయిల్ సిఎస్ఆర్ నిధులు 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిన వినియోగంలోకి రాలేదు. జల జీవన మిషన్ నిధులతో నిర్మించినా పైపులైను కలెక్షన్లు కలపలేదు.

ఈ ప్రాంత వాసులకు ప్రధాన పంట కాలువ సమీపంలో బోరు వేసి బోరు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ముస్లిం ఏరియాలో అరకొర సరఫరాతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒకటో వార్డు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు ఉన్న ప్రాంతంలో అసలు పైపులైను లేక టిన్ వాటర్ కొనుగోలు చేసుకుని అవస్థలు పడుతున్నామని ఈ ఏరియా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మల్లాయిపాలెం, సిద్ధార్థ నగర్లల్లో శివారు ప్రాంతాల్లో తాగునీరు అంతంతమాత్రంగా వస్తుండడంతో త్రాగునీటికే వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో శివారు ఎస్‌సి ఏరియాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా సంబంధిత ఉన్నతాధికారులు దష్టి సారించాలని ఆయా ప్రాంతవాసులు విన్నవిస్తున్నారు.



నిరుపయోగంగా తాగునీటి కుళాయి



గోతులోనే కుళాయిలు

బిందెడు నీరు దొరకడమే గగనం



బిఎస్.మూర్తి రోడ్డులో బిందెడు నీరు దొరకడం గగనమే గుంత తవ్వితేనే గొంతు తడిచే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గుంతలలో బిందెడు నీరు పట్టుకోవడానికి అవస్థలు పడుతున్నాం. అందరికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందని పరిస్థితి.

-దిపాటి గంగాచలం, వ్యవసాయ కూలి, తాడివారి మెరక రోడ్డు, నగరం

ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలి



తాడివారి మెరక ఎస్‌సి ఏరియా వాసులు స్వచ్ఛమైన తాగునీరు కోసం అవస్థలు ఎదుర్కొంటున్నాం. భూగర్భ జలాలు కలుషితమైన నేపథ్యంలో బోరు నీరే ఈ ప్రాంతానికి సరఫరా జరుగుతుంది. ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలి.

- జాలెం రమేష్, కూలి, బిఎస్.మూర్తి రోడ్, నగరం

తాగునీటిని కొనుగోలు చేస్తున్నాం



నగరం 1వ వార్డులో అసలు పైపులైన్ ఏర్పాటు కాకపోవడంతో టిన్ వాటర్ కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నాం. పైప్ లైన్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. ఈ వేసవిలో ట్యాంకర్లు ద్వారా తాగునీరు అందించాలి.

–జాలెం జ్యోతి, గృహిణి, 1వ వార్డు జాలెంవారి వీధి,నగరం



ర్యాలీ నిర్వహిస్తున్న దళిత ప్రజా సంఘాలు

తొలగించిన అంబేద్కర్ విగ్రహాలను పునఃప్రతిష్ట చేయాలి

దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ జయంతి రోజున జిల్లాలో తొలగించిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలను ప్రభుత్వమే పున:ప్రతిష్ట చేయాలని ఆదివారం దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్ విగ్రహాలు తొలగించిన పోలీస్, రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత పట్ల పోలీసుల దౌర్జన్య వైఖరి నశించాలని, అంబేద్కర్ విగ్రహాలను తొలగించిన అధికారులను సస్పెండ్ చేయాలని విగ్రహాలను నెలకొల్పే వరకు పోరాటం చేస్తాం అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజున అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐదు విగ్రహాలకు పైగా తొలగించడం అన్యాయమని అన్నారు. ఒకపక్క ప్రభుత్వాలు భారీ అంబేద్కర్ విగ్రహాలు నిర్మిస్తున్నాయన్నారు. అయితే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొంతమంది కుల దురహంకారులు అంబేద్కర్‌కు వ్యతిరేకంగా తప్పుడు ఫిర్యాదులు ఇచ్చారన్నారు. దీంతో కొంతమంది అధికారులు కావాలని కుల వివక్షతో అంబేద్కర్ విగ్రహాలను గడ్డపారలతో, జెసిబి మిషన్లతో దౌర్జన్యంగా తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంబేద్కర్ విగ్రహాలను అనుమతులు లేవని సాకుతో తొలగించడం ఆపాలని తొలగించిన విగ్రహాలను ప్రభుత్వ నిధులతోనే పున: ప్రతిష్ట చేయాలని డిమాండ్ చేశారు కామన గురువు లో అంబేద్కర్ విగ్రహాన్ని దౌర్జన్యంగా తొలగించిన తాలూకా ఎస్ఐ, పంచాయతీ సెక్రటరి, విఆర్ఒలను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన అంబేద్కర్ విగ్రహాలను పున ప్రతిష్ట చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉధతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు డిబి.లోక్, జంగా బాబురావు, ఇసుకపట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బొంతు రమణ, మెండు రమేష్ బాబు, పొలమూరి మోహన్ బాబు, పి.పరశు రాముడు, పులపర్తి వెంకటేశ్వరరావు, విప్పర్తి రమణ తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అమలాపురం అగ్ని మాపక కేంద్రాధికారి మురళి కొండ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలో లంకలపల్లి అపార్టెమెంట్స్ శ్రీనివాస్ రెసిడెన్సీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిద అగ్ని ప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాలకు కూడా వెళ్లి అగ్ని మాపక వారోత్స వాల కర పత్రా లు పంపిణీ చేశారు. **మండపేట** స్థానిక విజయలక్ష్మి నగర్ లోని అగ్నిమాపక సిబ్బంది మార్క్ డ్రిల్ నిర్వహించారు. మండపేట అగ్నిమాపక అధికారి జె.హనుమంత రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



అమలాపురంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వంట కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా సుందరపల్లి హై స్కూల్ విద్యార్థులు వంట కార్మికులకు దుస్తులను బహూకరించి వారిని సత్కరించారు. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు కొనియాడారు. దుస్తులు అందజేసిన విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



వంట కార్మికులను సత్కరిస్తున్న విద్యార్థినులు



పట్టణంలో మూత పడ్డ జనరిక్ మందుల షాపు

మూతపడిన జనరిక్ షాపు

ఇబ్బందులు పడుతున్న రోగులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణం లోని ఏరియా ఆసుపత్రి ఆవరణ లో గల జనరిక్ మందుల షాపు సుమారు నెల రోజులు గా మూత పడింది. ఆసుపత్రి లో రోగులకు తక్కువ ధరకు మందులు లభించాల నే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద జనరిక్ మందులు షాపులు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఆవరణలో గల ఈ షాపు మూత పడటం తో రోగులు అవసరమైన మందులు బయటకు వెళ్లి అధిక ధరలకు కొనవలసి వస్తోంది.. దీనితో ఒక వైపు అధిక మొత్తంలో డబ్బు లు ఖర్చు అవుతుంది.దానితో పాటు అదనపు సమయం వధా అవుతుంది అని రోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు.వీలైనంత త్వరగా జనరిక్ మందులు షాపు తెరిపించి రోగులకు ఉపశమనం కలిగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కార్టూ'నిజం'



ఇంటికి వద్దన్నానని.. ఒంటికి అంటించి పోయార్రా బాబూ..!!

గోతులమయంగా రహదారి

ప్రజాశక్తి - ఆలమూరు

ఏడాది తిరగకుండానే రూ.4.166 కోట్లతో నిర్మించిన రోడ్డు అక్కడక్కడా గోతులమయంగా మారింది. గత ఏడాది చొప్పెల్ల నుంచి పెనికేరు వరకు సుమారు 8.6 కి.మీ మేర బిటి రోడ్డు నిర్మించారు. ఇందులో భాగంగా చొప్పెల్ల దళితవాడ వద్ద రోడ్డు పొడవు సుమారు 150 మీటర్లు మాత్రమే సిసి రోడ్డును నిర్మించారు. బిటి రోడ్డు నిర్మాణం పంచాయతీ రాజ్ (పిఐయు) ప్రాజెక్ట్ కాకినాడ శాఖ అధికారి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేశారు. దీని నిర్మాణం 2020లో ప్రారంభించి 2022 వరకు జరిగింది. దీని నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఏడాది తిరగకుండానే బిటి రోడ్డు గోతులుపడింది. ఈ రహదారిపై భారీ వాహనాలు వెళితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. అలాగే దీనిపై భారీ వాహనాలు వెళ్లే అవకాశం లేదని స్థానికులు చెబుతున్నారు. రైతులకు సంబంధించిన వాహనాలు తప్ప మిగిలిన వాహనాలు రవాణా చేసే అవకాశం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి నాణ్యమైన మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి సంబంధించిన అధికారి వివరణ కోసం ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు.



నర్సిపూడి, మోదుకూరు మధ్య గోతులు పడిన రోడ్డు

ప్రమాదకరంగా పుంత రోడ్డు

ప్రజాశక్తి -మండపేట

ఏడిద సీతానగరం నుంచి ఏడిద సావరం వరకు ఉన్న పుంత రోడ్డు కుంగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు 10 మీటర్ల మేర ఈ రోడ్డు కుంగిపోయి కాలువలోకి దిగిపోతుండడంతో ప్రమా దాలను తలపిస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు గ్రామాల కలిపే ఈ రోడ్డును ప్రజలు, రైతులు, కార్మికులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ప్రస్తుతం ధాన్యం తరలింపు నేపథ్యంలో ఈ రోడ్డు వినియోగం ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ రోడ్డుకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కుంగిపోయిన సీతానగరం పుంత రోడ్డు



రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శంకుస్థాపన చేశారు. భీమ్ నగర్ లో జెడ్ పి నిధులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు సర్పంచ్ ఊర్మిళాదేవి శంకుస్థాపన చేశారు.అలాగే గ్రామంలో రూ.4లక్షల50వేల తో అంగన్‌వాడి భవన మరమ్మత్తు పనులను సర్పంచ్ శ్రీకారం చుట్టారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, వడ్డి గోపాలకృష్ణ, బళ్ళ నాగ సతీష్, ఆశపు బుజ్జి, నందుల సత్య,సలాది స్వామి నాయుడు, నాగా వాసు, పుత్యల ఏసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమల పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు దగ్గులూరి చెందిన మల్లా విఠల్‌రామ వెంకటకేశవరావు, వెంకటలక్ష్మి దంపతులు రూ.50 వేలు ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఇఒ సత్యనారాయణ రాజుకు అందజేశారు.



వెంకన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మూలస్థానం గ్రామ మాజీ సర్పంచ్ సలాది వెంకట్రావు (వెంకన్న) ఇటీవల మతి చెందారు. కొత్తపేట నియోజకవర్గ వైసిపి నేత చిర్ల రామచంద్రరెడ్డి, మాజీ ఎంపిపి తోరాటి రాంబాబు, మరో నేత గంద్రోతు వీరగోవిందరావులతో పాటు పలువురు నాయకులు మృతుడు వెంకన్న కుమారుడు జనసేన నేత జయప్రకాష్ నారాయణను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెంకన్న చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. గ్రామానికి వెంకన్న చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.



నివాళులర్పిసున్న మంత్రి వేణు తదితరులు

దేవస్థానం ధర్మకర్త వీర్రాజు మృతికి సంతాపం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కందులపాలెం లో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానం వారసత్వ ధర్మకర్త బొప్పన వీర్రాజు (81) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మతికి హైకోర్టు జడ్జి చక్రవర్తి, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ బోసు, పిల్లి సూర్యప్రకాష్ తదితరులు కందులు పాలెం లోని వీర్రాజు మృతదేహానికి నివాళు లర్పించారు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కందులపాలెం సొసైటీ ప్రెసిడెంట్‌గా, గ్రామ మున్సిబ్‌గా ఆయన పని చేశారు. హసన్‌బాద సాయిబాబా దేవాలయానికి స్థలం దానం చేశారు. పలువురు గ్రామస్తులు ఆయనకు మృతికి సంతాపం తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటుకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆలమూరు

వేసవిలో దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని పలువురు విజ్ఞప్తిచేస్తున్నారు. సర్వసాధారణంగా వేసవిలో వాహనదారులు ప్రయాణంలో భాగంగా తమ దాహార్తిని తీర్చుకునేందుకు దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆశ్రయిస్తారు. అందుకే ఎండాకాలం వచ్చిందంటే వివిధ రాజకీయ పార్టీల నేతల ఆధ్వర్యంలో గ్రామాల పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే నేటికీ ఆలమూరు మండలంలో చలివేంద్రాల ఏర్పాటు చేయలేదు. మండల పరిధిలో మడికి, జొన్నాడ 216ఎ జాతీయ రహదారితో పాటుగా జొన్నాడ, గుమ్మిలేరు ఆర్ అండ్ బి రహదారులు అత్యంత ప్రధానమైనవిగా ఉన్నాయి. వీటిపై అనునిత్యం వివిధ రకాల పలు వాహనాలు రాత్రి పగలు తేడా లేకుండా రాకపోకలుసాగిస్తాయి. ప్రస్తుతం ఎండ వేడిమికి తాళలేక పలువురు ప్రయాణికులు అవస్థలు పడుతూనే తమ ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి పలు చోట్ల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేసుల కొట్టివేతపై దళిత నాయకుల హర్షం

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం మండలం గోపాలపురంలో గత పదినెలలు క్రితం ఒక హోటల్లో జరిగిన సంఘటనలో దళిత యువకులుపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ సంఘటనపై రాజమహేంద్రవరం కోర్టు దళిత యువకులపై అక్రమంగా పెట్టిన కేసులను కొట్టివేయడంతో కొత్తకోట నియోజకవర్గ దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రావులపాలెం వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, అమలాపురం అర్బన్ డెవలపెమెంట్ అథారిటీ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు మాట్లాడుతూ గోపాలపురం ఘటనపై కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి గోపాలపురం ఘటనను ఉన్నతాధికారులతోపాటు సిఎం జగన్ దష్టికి తీసుకొని వెళ్లారన్నారు. స్పందించిన ముఖ్యమంత్రి దళిత యువకులుపై పెట్టిన కేసులను ఉపసంహరించుకునేలాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. దీంతో రాజమహేంద్రవరం కోర్టు దళిత యువకులను విడుదల చేసిందని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, న్యాయవాది కాపా కళ్యాణ్, దళిత సంఘాల నేతలు యువకులు పాల్గొన్నారు. **కొత్తపేట** రావులపాలెం మండలం గోపాలపురం ఘటనలో దళిత యువకులపై నమోదైన కేసులను లోక్ ఆదాలత్ లో కేసు కొట్టివేయడం హర్షణీయం అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి.ముత్యాల బాబ్జి, సర్పంచ్ బూసి విజయలక్ష్మి తదితరులు హర్షం వ్యక్తంచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇళ్ల సూర్యనారాయణ

సబ్సిడీ యంత్రాల పనితీరు పరిశీలించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వం రైతు సంఘాలకు అందించిన సబ్సిడీ యంత్రాల పనితీరు పరిశీలించాలని మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఇళ్ళ సూర్య నారాయణ సూచించారు. మండల వ్యవసాయ మండలి ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం సబ్సిడీ యంత్రాలు, ట్రాక్టర్లు, ఇతర పరికరాల వల్ల రైతులకు చేకూరిన లబ్ధిని అంచనా వేయాలన్నారు. దీనిని గ్రామాల్లో గల వ్యవసాయ సహాయకులు వివిఎలు పరిశీలన చేయాలని అదే విధంగా ఇతర రైతులు వాటిని సేద్యానికి వాడుకునే అవకాశాలను వివరించాలని కోరారు. ప్రభుత్వం అందించిన పరికరాలపై వ్యవసాయ శాఖ అజమాయిషీ ఉండాలని ప్రభుత్వం ప్రకటించిందని ఆయన వివరించారు.అదే విధంగా రైతులకు వివిధ పరికరాలు అద్దెకు పొందేందుకు ఆన్ లైన్ అవకాశాలను ఉపయోగం లోనికి తీసుకువచ్చే ప్రక్రియ ఏర్పాటవుతుందని ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.రవి తెలియజేశారు. దీనితో పాటుగా భూసారం పెంపొందించేందుకు పచ్చి రొట్ట విత్తనాలు వేయాలని వీటిని యాభై శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉంచామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయకులు రైతులు,పాల్గొన్నారు.

'జెసిఎస్' మండల కన్వీనర్‌గా వెంకటేశ్వ రరావు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గా కొనసాగుతున్న కొమరగిరి మాజీ సర్పంచ్ సఖిలే వెంకటేశ్వరరావు ను జగనన్న కమిటీ సారధి మండల కన్వీనర్(జెసిఎస్)గా పార్టీ అధిష్ఠానం నియమించిందని వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతి రాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. పలువురు వై సి పి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో ఈనెల 17 వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమాలు యథా విధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన హాల్లో జిల్లాస్థాయిలోను, అదేవిధంగా డివిజన్, మండల కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. అధికారులు అందరూ ఉదయం 10 గంటల నుంచే అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని గ్రామ వార్డు సచివా లయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

అగ్రహారంలో వెలగని వీధిదీపాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం శివారు అగ్రహారంలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది రంభ హోటల్ సెంటర్ నుంచి ఉచ్చిలి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు అగ్రహారం దళిత పెద్ద పేటలో విద్యుత్ దీపాలు వెలగక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికుల వాపోతున్నారు. ఈ మార్గం నుంచే నరసన్నపేట దళితచిన్న పేట వాసులు ప్రయాణించాల్సి ఉంది. ఈ రోడ్డు మార్గాన ఒక పక్క గృహాలు మరో పక్క పంట పొలాలు ఉండడంతో రాత్రి సమయంలో విష సర్పాలు రోడ్డు మీద సంచరిస్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు ఉన్నతాధికారులు కలగజేసుకుని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'సహకార' ఎన్నికల నిర్వహణలో కాలయాపన

ప్రజాశక్తి-కొత్తపేట

నిబంధనలు తుంగలోకి తొక్కి వైసిపి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలను జరపకుండా కాలయాపన చేస్తోందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాలను రాజకీయ పార్టీ ప్రతినిధులు చెప్పు చేతల్లో ఉంచి రైతు ప్రయోజనాలు కన్నా, రాజకీయ ప్రయోజనాలకే వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విమర్శించారు. సొసైటీలకు ఐదున్నరేళ్లగా ఎన్నికలు లేకుండా పర్సన్ ఇన్చార్జ్ కమిటీల పేరుతో కొనసాగిస్తూ వ్యవస్థను అపహాస్యం పాలు చేస్తుందన్నారు. వెంటనే చట్టపరంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం సుంకరపాలెం పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన పలివెల మురళీకృష్ణ (33) అనే కార్మికుడు భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన కోరంగిలో ఒక ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహానికి తాడుపై ఉండి రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మురళీకృష్ణ మరణించాడని తెలిపారు. మురళీకృష్ణ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. భవనంకు చెందిన సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మురళీకృష్ణ మరణించాడని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పెయింటింగ్ వేసే కార్మికుడికి హెల్పర్‌గా మరో కార్మికుడిని మాత్రమే సహాయకుడిగా వేయాల్సి ఉండగా అవగాహన లేని వ్యక్తులను నియమించడం వల్ల అతని నిర్లక్ష్యం కారణంగానే మురళీకృష్ణ మరణించాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబానికి జీవనాధారమైన తన భర్తను కోల్పోయానని మురళీ కృష్ణ భార్య ప్రశాంతి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. కోరింగ ఎస్ఐ పి. శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లారీ కిందపడి వృద్ధుడు..

ప్రజాశక్తి - కాజులూరు

ధాన్యం లారీ కింద పడి కోట సుబ్బారావు (70) మృతి చెందినట్టు గొల్లపాలెం ఎస్ఐ తులసి రామ్ తెలిపారు. కుయ్యేరు శివారు రేగుబడవ గ్రామానికి చెందిన కోట సుబ్బారావు ఆదివారం ఇంజరంలో కిరాణా సరుకులు కోనుగోలు చేసి స్వగ్రామైన రేగుబడవకు సైకిల్‌పై వెళుతుండగా కోలంక శివారుకు వచ్చేసరికి యానం నుండి ద్రాక్షారామం వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ కింద పడగా అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ తులసీ రామ్, పోలీస్ సిబ్బంది బలరామకృష్ణ, శివకుమార్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తులసి రామ్ తెలిపారు.

బస్సులో యువకుని దుర్మరణం

ప్రజాశక్తి -రౌతులపూడి

కాకినాడలో వైద్యం పొందుతున్న తమ బంధువులను పరామర్శించి తిరిగి తన స్వగ్రామమైన బలరామపురం ఆర్‌టిసి బస్సులో తిరిగి వస్తూ యువకుడు మృతి చెందాడు. రౌతులపూడి మండలం బలరామపురం గ్రామానికి చెందిన పైల లోవరాజు (38) ఆదివారం ఉదయం 7 ఏడు గంటలకు బలరామ పురం నుంచి కాకినాడ వెళ్లిగా తిరిగి కాకినాడ నుంచి ఆర్‌టిసి బస్సులో బలరామపురం వచ్చే సమయంలో తన స్వగ్రామైన బలరామపురం వచ్చినప్పుడుకి ఎంతకు బస్సు దిగకపోవడంతో లోవరాజు అక్కచెల్లెళ్ల బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు బస్సు దింపి పరిశీలించడంతో అప్పటికే మృతి చెంది ఉండడంతో మృతుని బంధువులు స్థానికులు చలించిపోయారు. మతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు

రోడ్డు ప్రమాదంలో యువతి ..

ప్రజాశక్తి- కరప

కరప మండలం గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన యువతి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు తి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు జనసేన పార్టీ గొడ్డటి పాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరం రెడ్డి ముత్యాలరావు తన కుమార్తె చంద్రకళ (17)ఇంటర్ సెకండియర్ చదువుతోంది. వీరు ఇద్దరూ మోటర్ బైక్‌పై తన బంధువులు ఇంటికి వెళుండగా తొండంగి మండలం తమ్మయ్య పేట జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టడంతో తండ్రి కూతుర్లకు తీవ్ర గాయాలు కాగా, కుమార్తె అక్కడికక్కడే మతి చెందింది . మతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ముత్యాలరావుకు గాయాలయ్యాయి చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఈ సంఘటన తెలుసుకున్న జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్ పంతంనానాజీ, భోగి రెడ్డి కొండబాబు, యాళ్లపండు, సైనవరపు శంకర్ తదితరులు వారి వద్దకి చేరుకుని వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సంఘ టనతో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

అనుమానాస్పద స్థితిలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆదివారం వివాహిత మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇవి.. ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన భాగ్య కుమారి ఇంటర్ మొదటి సంవత్సరం చదివింది. అయితే 2013లో ఏలూరులో ట్రైనింగ్ తీసుకుంటుండగా నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని చిట్యాలకు చెందిన మెరిపే గణేష్‌తో పరిచయం ఏర్పడి అదే సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటినుండి ఇద్దరూ చిట్యాలలో నివాసం ఉంటున్నారు. గణేష్ కౌలు వ్యవసాయం చేస్తుంటాడు.ఈ క్రమంలో వ్యవసాయంలో నష్టాలు వచ్చాయి దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భాగ్య కుమారికి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా హాస్పటల్లో చూపించలేని కారణంగా భర్త పై కోపంతో మనస్థాపానికి గురై ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుంది. ఆమెను సిహెచ్‌సికి వైద్యులు పరీక్షించి, భాగ్యకుమారి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు గోనె మరియదాసు, దేవదాసు ఇచ్చిన ఫిర్యాదు పై ఎస్ఐ రామకృష్ణ నమోదు చేశారు.

చెరువులో మునిగి కూలీ..

ప్రజాశక్తి-పెరవలి

తాడేపల్లిగూడెం మండలం లింగారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఆరేపల్లి యేసు సాన్నం చేసుందుకు చెరువులో మునిగి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. యేసు చుట్టుపక్కల గ్రామాలకు కూలీ పనులకు వెళతాడు. ఇతని వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక వారం రోజులు క్రితం పెరవలి మండలం నడుపల్లి గ్రామంనకు యేసు కూలీ పనికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం స్నానం చేయుటకు వల్లభస్వామి పంచాయతీ చెరువు లో దిగి ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎమ్.సూర్య భగవాన్ తెలిపారు.

యానాం వార్తలు



ఫ్రెంచ్ కెనాల్ లాకులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్, మునిస్వామి

మోటార్ల సాయంతో నీటిని మళ్లించాలి - ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని ఫ్రెంచ్ కెనాల్ నుంచి తాగునీరు సక్రమంగా రావాలంటే పిల్లంక- బ్రహ్మపురి మధ్య ఉన్న ఫ్రెంచ్ కెనాల్ లాకులు వద్ద మోటార్లు పెట్టి పంపింగ్ చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సూచించారు. ఆదివారం ఆయన పిల్లంక - బ్రహ్మపురి మధ్యలో ఉన్న ఫ్రెంచ్ కెనాల్ లాకులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే యానాంకు తాగునీటి సమస్య తలెత్తకుండా సహాయపడాలని ధవిళేశ్వరం సూపరింటెండెంట్ ఇంజనీరును స్వయంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో మీదట ఆయన స్పందించారన్నారు. యానాంకు సైతం వంతులు ఇస్తామని ఫ్రెంచి లాకులు వద్ద క్రాస్ బండ్ వేసుకుని నీటిని మళ్లించుకోవాలని సూచించారన్నారు. గతంలో సైతం ఇదేవిధానాన్ని అనుసరించారన్నారు. ఈ నేపథ్యంలో క్రాస్ బండ్ వేసి నీటిని తోడేందుకు పనులు మొదలు పెట్టాలని సంబంధిత పిడబ్ల్యుడి అధికారులకు ఆదేశిస్తే పనులు మొదలు పెట్టకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అంతకుముందు తాగునీటి ఎద్దడి నివారణకు 55 ఎకరాల చెరువులో నీటిని నింపాల్సిన పరిస్థితి తదితర విషయాలపై ఎంఎల్ఎ అశోక్ ఆర్ఎఒ మునిస్వామితో చర్చించారు.

పరిశీలనా స్థలానికి రాని పిడబ్ల్యుడి ఇంజనీర్లు


పిల్లంక -బ్రహ్మపురి మధ్యలో ఉన్న ఫ్రెంచికెనాల్ లాకుల వద్ద వాటర్ లెవెల్స్ ను పరిశీలించడానికి వెళ్లిన ఎంఎల్ఎ అశోక్ తో స్థానిక పిడబ్ల్యుడి ఇంజనీర్లు వెళ్లకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతుంది. తాగునీటిని అందించాల్సిన బాధ్యతగల ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం, ఎంఎల్ఎ కు సహాయనిరాకరణ చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

18న విద్యుత్ సమస్యల ఫిర్యాదుల స్వీకరణ

పుదుచ్చేరి ప్రభుత్వ విద్యుత్ చట్టం 2003 లోని నిబంధనల ప్రకారం విద్యుత్ వినియోగదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించడానికి ఈనెల 18న ఉదయం 9 నుండి విద్యుత్ శాఖ కార్యాలయం నందు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు లంక కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు బిల్లులు జారీ ఆలస్యం, సవరణ, మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, తక్కువ వోల్టేజ్ తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

దేవస్థానం అభివృద్ధికి కీలక సంస్కరణలు

'ప్రజాశక్తి'తో ఇఒ ఎస్.సూర్యచంద్రశేఖర్ ఆజాద్





ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రాల్లో అతి ముఖ్యమైనది అన్నవరం దేవస్థానం. ఇక్కడకు నిత్యం వేలసంఖ్యలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు దర్శనాలు, వ్రతాలకు హాజరవుతుంటారు.వారికి సరైన వసతులు కల్పించడానికి, దళారీ వ్యవస్థను నిర్మూలించి ధరల నియంత్రణకు పాలక మండలి పూర్తి సహాయ, సహకారాలతో దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి కీలక సంస్కరణలు చేపట్టనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎస్.సూర్యచంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ...

● ఉద్యోగ ప్రస్థానం

2000 సంవత్సరంలో శ్రీకాకుళం దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గా విధుల్లో చేరాను. 2004-05 వరకూ విజయవాడలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పని చేసాను. ఆ తర్వాత పదోన్నతిపై గుంటూరు డిసిగా 100 రోజులు పని చేశాను. వరంగల్ కేంద్రంగా 2007 నుంచి 2010 వరకు ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలకు డీసీగా పని చేసి, కొంతకాలం హెడ్ ఆఫీస్ లో ల్యాండ్స్ జాయింట్ కమిషనర్ గా పనిచేశాను. 2010-12 వరకు భద్రాచలం ఇఒగా, 2012-13 వరకు పెనుగంచిప్రోలు ఇఒగా పని చేసి 2013 ఫిబ్రవరిలో శ్రీశైలం బదిలీ అయ్యాను. 2014 అక్టోబర్ నుంచి 2017 డిసెంబరు వరకూ రాజమండ్రి ఆర్‌జెడిగా వచ్చాను. తిరిగి 2019 నుంచి 2023 వరకూ హెడ్ ఆఫీస్‌లో ఎస్టేట్స్ జాయింట్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టి బదిలీపై 2023 మార్చి 4న అన్నవరం ఇఒగా వచ్చాను.

● బాధ్యతలు చేపట్టిన తర్వాత సంస్కరణలు

అన్ని దేవాలయాల్లో కల్లా ఇక్కడి ప్రసాదం ఎంతో ప్రత్యేకమైనది.సందర్శకులకు క్వాలిటీగా, రుచికరమైన ప్రసాదాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు రెండు రకాల ప్రసాదాలు ఉండేవి.ఇక నుంచి ఒకే రకమైన ప్రసాదం అందిస్తున్నాం. దేవస్థానంలో సత్యదేవుని వ్రతం, నిత్య కల్యాణం, ఇతర పూజలకు భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనాలనే నిబంధనను అమలు చేస్తున్నాం. వ్రతం, ఇతర పూజల్లో పాల్గొనేందుకు పురుషులు పంచె, కండువా, లేదా కుర్తా, పైజమా, మహిళలు చీర లేదా కుర్తా, పైజమా తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పిస్తున్నాం. దేవస్థానం నిత్యాన్నదాన పథకంలో కచ్చితంగా అరిటాకుల్లోనే అన్న ప్రసాదం అందిస్తున్నాం. కంచాల్లో వడ్డించే పద్ధతిని తొలగించాం. అన్యమత ప్రచారాలపై దృష్టి సారించాం. సందర్శనకు వస్తున్న వారందరూ తప్పని సరిగా నామాలు గానీ విభూది గాని పెట్టుకోవాలనే నిబంధన విధించాం. సాంకేతిక పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.సుమారు 125 కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నాం. క్రమం తప్పకుండా ఉద్యోగులు విధుల్లోకి హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాము.

● సత్య దేవుని కళ్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతి సంవత్సరం నిర్వహించే సత్యదేవుని కళ్యాణానికి గత ఏడాది మాదిరిగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.ఈనెల 30 నుంచి వారం రోజుల పాటు కల్యాణోత్సవాలు జరుగుతాయి. అయితే ఈసారి ప్రధానంగా ఉపయోగించే 100 కిలోల తలంబ్రాలను పవిత్రంగా సేకరించి చేతి గోటి వేళ్ళతో ధాన్యం నుంచి బియ్యాన్ని తయారు చేయించనున్నాం. భద్రాచలంలో మాదిరిగా కళ్యాణోత్సవాలు అందరికీ కనబడేలా ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాలుగు ఎల్ఈడి పెద్ద స్క్రీన్ లను ఏర్పాటు చేస్తున్నాం. తలంబ్రాల పంపిణీ కోసం తోపులాట లేకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్యేక విద్యుత్ కాంతుల నడుమ కల్యాణం జరుగుతుంది.

● అభివృద్ధికి ప్రణాళికలు

జాతీయ రహదారిపై విక్రయాలు జరుగుపుతున్న ప్రసాదం కౌంటర్ వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. దింతో విశాఖపట్నం వైపు నుంచి వచ్చే వారి కోసం జాతీయ రహదారిపై మరో ప్రసాదం కౌంటర్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయం జరిగింది.ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉంది. ప్రసాదం తయారు చేసే సిబ్బంది ఇబ్బందులను దష్టిలో ఉంచుకుని ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తాం. గొంది వద్ద నున్న సుమారు 150 ఎకరాల దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా తీసుకునే చర్యల్లో భాగంగా సోలార్ ప్లాంట్ కు లాంగ్ లీజుకిచ్చే ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

● సామాన్యులకు దర్శన సేవలు, అన్న ప్రసాదం మరింత నాణ్యతగా అందించేందుకు చర్యలు

విఐపీలు వచ్చినప్పుడు కూడా కామన్ మెన్ లైన్ ను కొనసాగించేలా చర్యలు చేపట్టాం. అన్న ప్రసాదం రుచిగా, శుచిగా అందించే విధంగా చర్యలు తీసుకున్నాం. రోజుకి 3 వేల నుంచి 5 వేల మందికి అన్న దానం జరుగుతుంది.

● వసతి , వివాహ గదుల పెంపుపై ప్రణాళికలు

వివాహాలు పెద్ద ఎత్తున జరుగుతున్న సందర్భాల్లో దళారీ వ్యవస్థ ఎక్కువగా ఉంటుందని మా దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో వివాహాలు చేసుకునే వారికి వసతి, సౌకర్యాలు కల్పించేలా సింగిల్ విండో విధానం అమలు చేయాలని భావిస్తున్నాం. దీని ద్వారా గదులు, పురోహితులు, సన్నాయి మేళం, భోజనాలు ఇలా అన్నీ సౌకర్యాలు ఒకే చోట కల్పించేలా తీసుకునే చర్యల్లో భాగంగా ఒక కమిటీను కూడా ఏర్పాటు చేశాం. త్వరలోనే సింగిల్ విండో విధానం అమలు చేస్తాం.

● దుకాణాల్లో ధరల నియంత్రణకు చర్యలు

వివిధ దుకాణాలలో అధిక ధరలు వసూలు చేస్తున్నారని సందర్శకులు తరచూ మా దష్టికి తీసుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ హెచ్చరికలు, ధరల బోర్డులు ఏర్పాటు చేశాం. ఫిర్యాదులు వస్తే చర్యలు చేపడతాం.

● పార్కింగ్ సమస్యలపై చర్యలు

కొండపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకునే చర్యల్లో భాగంగా ఆగమ పాఠశాల నుంచి గిరి ప్రదక్షిణ రోడ్ త్వరలో నిర్మాణం కానుంది. రద్దీ సమయాల్లో దాని ద్వారా ట్రాఫిక్ మళ్ళిస్తాం.

మిషన్ వాత్సల్య పథకానికి 515 దరఖాస్తులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మిషన్ వాత్సల్య స్కీంకు ఇప్పటివరకూ 515 దరఖాస్తులు వచ్చినట్లు సామర్లకోట రూరల్ సిడిపిఒ ఉష చెప్పారు. అలాగే పెద్దాపురం నుండి 648 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ దరఖాస్తులను మండల స్థాయి అప్రూవల్ కమిటీ దృష్టికి తెచ్చి దరఖాస్తులను ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. మండల స్థాయి అప్రూవల్ కమిటీలో చైర్‌పర్సన్‌గా తహశీల్దార్, కో చైర్‌పర్సన్‌గా ఎంపిడిఒ, మెంబర్లుగా ఎంఇఒ, సిడిపిఒ, మెంబర్ కన్వీనర్‌గా సంబంధిత ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్ ఉంటారన్నారు. ఈ పథకం ద్వారా 18 సంవత్సరాల లోపు రక్షణ లేక సంరక్షణ అవసరమైన పిల్లల కుటుంబాలకు పిల్లలు ఆర్థిక లేదా ఇతరత్రా పిల్లల వైద్య, విద్య అభివృద్ధి అవసరాలను తీర్చేందుకు షరతులతో కూడిన సహాయంగా నెలకు ఒక్కొక్కరికి రూ. నాలుగు వేలు చొప్పున అందజేస్తారని తెలిపారు. తొలుత గ్రామ, వార్డు సచివాలయాల్లో అంగన్‌వాడీల ద్వారా దరఖాస్తులు స్వీకరించి వాటిని మండల స్థాయి కమిటీ సిఫార్సుకు పంపుతామన్నారు. జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు.. తల్లిదండ్రులు లేని పిల్లలు, విడాకులు తీసుకున్నవారు దానికి సంబంధించిన ధ్రువపత్రాలతో రుజువులు చూపాలని నిబంధనలు తెలియజేశారు.

నూకాలమ్మ జాతరలో సందడి

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోటలో 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతరకు 4వ ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు రావటంతో ఆలయ పరిసరాలు, పురవీధులన్నీ జన సందోహ మయ్యాయి. ఇఒ తలాటం వెంకట సూర్యనారాయణ, లయ కమిటీ చైర్మన్ గవరసాన వీరస్వామి(బాబ్జి)ల ఆధ్వర్యంలో క్యూలైన్లలో యాత్రికులకు దర్శన ఏర్పాట్లు చేశారు. గీతా శివ భక్త సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా మజ్జిగ, చిన్నారు లకు పాలు పంపిణీ చేశారు. జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ పళ్ళ గంగారావు, గవరసాన రామస్వామి, గంటా రామస్వామి, ఎలిసెట్టి వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ప్రయోజనాల సాధనకు పోరాటం

ప్రజాశక్తి - జగ్గంపేట

జర్నలిస్టులకు ప్రయోజనాల సాధనకు ఎపిడబ్ల్యూజేఎఫ్ పోరాట చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. జగ్గంపేటలోని నియోజకవర్గ నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విలేకరులకు సమాజంల జరుగుతున్న అన్యాయాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజేఎఫ జగ్గంపేట నియోజకవర్గం అధ్యక్షులుగా అడబాల వీరభద్రరావు, కార్యదర్శిగా తణుకు రామచంద్రరావులను, కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, ఉపాధ్యక్షురాలు మున్ని, పెద్దాపురం డివిజన్ కార్యదర్శి ఎండి.అధికారి జిల్లా నాయకులు ముమ్మిడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రపంచ కీర్తి శిఖరం అంబేద్కర్

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి ఇజ్రాయేల్

రాజ్యాంగ రచనతో ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాపితం చేసిన ప్రపంచ కీర్తి శిఖరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గొల్లవిల్లి శాంతినగర్ లో ఆదివారం బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌సి ఇజ్రాయిల్, సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ, దళిత నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, పెయ్యల పరశురాముడు, తొత్తరమూడి బాబులు, దోనిపాటి ఆంజనేయులు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌సి ఇజ్రాయేల్‌ను బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దళిత నాయకులు యలమంచిలి బాలరాజు, సఖిలే పథ్వీరాజ్, జొన్నాడ చిన్ని, పెయ్యల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ క్లినిక్ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

ఏడిదలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైసిపి నాయకులు పలివెల సుధాకర్, చంద్రమళ్ల బులివీర్రాజులతో కలిసి ఆదివారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ 50 శాతం ఎంజిఎన్ఆర్ఇజిఎస్, మరో 50 శాతం ఆరోగ్యశాఖ నిధులు రూ.17.50 లక్షలఅంచనా విలువతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండే విధంగా ఈ భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులో తీసుకొస్తామన్నారు.

పంటకోత ప్రయోగంలో 46 బస్తాల దిగుబడి

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ శివారులోని రైతు వల్లూరి శ్రీనివాస చౌదరి పొలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎంటియు 3626 వరిపంటకోత ప్రయోగం ఆదివారం నిర్వహించారు. 5 చదరపు మీటర్ల కొలతలతో ఈ పంటకోత ప్రయోగం నిర్వహించగా 29.160 కేజీలు వచ్చిందని సుమారుగా 46 బస్తాల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ ఎఒ ఏసుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రాచీన కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు కోరారు. తెలుగు రంగస్థల నాటక దినోత్సవాన్ని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ నాటక కళా పరిషత్ అధ్యక్షులు గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన కళాకారులు ముద్రగడ సత్యమూర్తి ని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రోత్సాహాల వల్ల అందరిలోనూ సమానత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కొర్రపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక సమత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో కొరపాటి నారాయణమూర్తి సంస్మరణ సభ సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా నారాయణ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటిపల్లి కష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఏసురాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వేమగిరి శామ్యూల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంపీ అనురాధ

జిల్లాలో వేర్వేరు చోట్ల బాధితకుటుంబాలకు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. వివరాలు ఇ వి..

అమలాపురం మృతుని కుటుంబానికి మంజూరైన ఎక్స్‌గ్రేషియాను అమలాపురం ఎంపీ చింతా అనురాధ అందజేశారు. అల్లవరం మండలం, గోడి గ్రామానికి చెందిన ఉప్పే ప్రసాద్ జీవనోపాధి కొరకు ఒమన్ దేశం వెళ్లి రెండు నెలల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎపిఎన్ఆర్‌టి సొసైటీ రూ.50,000 ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ చెక్కును ఎంపీ అనురాధ చేతుల మీదుగా మృతుని కుటుంబానికి అందించారు. ఒమన్ దేశం నుంచి మృతుని భౌతికకాయాన్ని భారతదేశానికి తీసుకురావడం, విమానాశ్రయం నుండి మృతుని స్వస్థలానికి ఎపిఎన్ఆర్‌టి సొసైటీ ఉచిత అంబులెన్స్ కూడా ఏర్పాటు చేసింది. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ చాలామంది జీవనోపాధి కొరకు కొంతమంది అక్రమ ఏజెంట్ల ద్వారా విజిట్ వీసాల మీద గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. అక్కడికి వెళ్ళాక ఇబ్బందులకు గురవుతుంటారు. ఇటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండాలంటే ఎపి ప్రభుత్వ సంస్థ ఏపిఎన్ఆర్‌టి సొసైటీని సంప్రదిస్తే మీకు మార్గదర్శకత్వం అందిస్తుందన్నారు. ఎపిఎన్ఆర్‌టి అధ్యక్షులు వెంకట్ ఎస్.మేడపాటి మాట్లాడుతూ ఎపి సిఎం జగన్ మార్గదర్శకత్వంలో ప్రవాసాంధ్రుల అభివృద్ధి, భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ఎపిఎన్ఆర్‌టి నిరంతరం పనిచేస్తోందన్నారు. విదేశాలకు వెళ్లే వారు ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్ళే వారికోసం ఏపిఎన్ఆర్‌టి సక్రమ వలసల పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. **కొత్తపేట** వాడపాలెం గ్రామానికి చెందిన కాండ్రేకుల సత్యవతి ఇటీవల అనార్యోగంతో బాధపడుతూ మరణించారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని దష్టిలో పెట్టుకొని ఆమె కుటుంబ సభ్యులకు వాడపాలెం గ్రామ యువ శెట్టి బలిజ సంఘం వారు రూ.15 వేలు సాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన వాడపాలెం శెట్టిబలిజ యువతకు కొత్తపేట మండల యువ శెట్టిబలిజ సంఘం వారు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో దునబోయిన చందు, దునబోయిన సాయి రాం, శీలం శ్రీనివాస్ శెట్టి, సానబోయిన శ్రీను, వాసంశెట్టి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు నిలిపివేయకపోతే ఆందోళన

ప్రజాశక్తి-మండపేట

అక్రమ తవ్వకాలు నిలిపివేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం కెపి.రోడ్డులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడారు. కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా గోదావరి నదికి అడ్డుకట్ట వేసి, పెరుగులంకను కొందరు నాయకుల అండదండలతో అక్రమంగా తవ్వేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారన్నారని అన్నారు. పెరుగులంక తవ్వడం వల్ల గోదావరికి వరదలొస్తే కింద లంక గ్రామాలు వరదముంపునకు గురయ్యే ప్రమాదం వుందన్నారు. ఈ అక్రమ తవ్వకాలకు పలువురు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు పాల్గొన్నారు.

'ఎంఎల్‌సి, సిఐ వల్ల ప్రాణహాని'

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మండపేట సిఐ శివ గణేష్ వల్ల తనకు, తమ, కుటుంబానికి ప్రాణహాని ఉందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలా కృష్ణ అన్నారు. ఆదివారం వల్లూరు లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో లీలా కృష్ణ మాట్లాడారు. తాతపూడి ర్యాంపు లో జెపి వెంచర్స్ పేరుతో అనుమతి లేకుండా నదీ గర్భంలో అక్రమ మైనింగ్ జరుగుతుందని హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీనిపై ర్యాంపుల బాట తొలగించాలని రెవెన్యూ అధికారులకు అదే శిస్తూ హై కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. అక్రమ మైనింగ్ ద్వారా రూ.కోట్లు వైఎస్ఆర్ ఎంఎల్‌సితోటకు, సి ఐ శివ గణేష్ కు అందుతున్నాయని ఆరోపించారు. వారి అక్రమార్జనకు అడ్డుపడుతున్నానన్న కక్షతో తనను తన కుటుంబాన్ని హత్య చేసేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలపై తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. సిఐ శివ గణేష్ పై ఉన్న అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా సోమవారం జిల్లా ఎస్‌పికి అందజేస్తానని అన్నారు.